"నీకు, నాకు మధ్య గల తేడా ఏమిటో తెలుసా? నాకున్న భవంతిని, కార్లని, డబ్బుని ఈ క్షణం నేను విడిచిపెట్టి నడిచి వెళ్ళిపోగలను. ఆ తర్వాత మళ్ళీ ఎన్నడూ వాటి గురించి ఒక్క క్షణం కూడా ఆలోచించను. నువ్వా పని చేయగలవా?" అడిగాడు స్వామి.

ఆ ధనవంతుడు సిగ్గుతో తల వంచుకున్నాడు.

## 173. బానిస

అడవిలో ఏనుగు పిల్లలని వేటగాళ్ళు పట్టుకున్నాక వాటి మెడలకి బలమైన ఇనప గొలుసుని కడతారు. తప్పించుకోడానికి అవి విఫల ప్రయత్నం చేస్తాయి. అలా కొన్ని వారాలపాటు ప్రయత్నించినా తమ మెడలకి కట్టిన గొలుసుల నించి అవి తప్పించుకోలేకపోతాయి. కొంతకాలం తర్వాత ఆ ఏనుగు పిలల్లకి అర్థమవుతుంది, తాము ఎంత లాగినా ఉపయోగం ఉండదని. దాంతో అవి లాగడం, గుంజుకోవడం ఆపేస్తాయి. తమ మెడలకి కట్టిన పట్టీలని తాము తెంచుకోలేము అన్న సంగతి వాటికి అనుభవంతో స్పష్టమవుతుంది.

ఆలాంటి ఏనుగు పిల్ల పెరిగి పెద్దదయ్యాక దాని మెడని సన్నటి తాడుతో స్థంభానికి కడతారు. ఆ తాడుని అది గట్టిగా లాగితే స్వేచ్ఛగా నడిచి వెళ్ళిపోవచ్చు. కాని అది విడిపించుకునే ప్రయత్నమే అసలు చేయదు. ఎందుకంటే తన మెడకున్నది తెగదన్న అనుభవానికి అప్పటికే అది బానిస అయింది.

ఇదే విధంగా మనం జీవితంలో చాలా విషయాల్లో అనేక అనుభవాలకి బానసలమై ఆ ఏనుగులా ప్రవర్తిస్తూంటాం. ప్రయత్నిస్తే చాలా అలవాట్ల నించి, పరిస్థితుల నించి మనం తేలిగ్గా బయట పడగలం అన్న సత్యం మనకి తెలీకుండానే జీవిస్తూంటాం.

(ఈ కథని మాతా అమృతానందమయి జెనీవాలోని ఆధ్యాత్మిక మహిళా లీడర్స్ సభలో చెప్పింది. మనకి వచ్చే దుఃఖాలన్నీ చిన్నప్పటి నించి మనం వాటి అనుభవాలకి బానిస అవడం వల్లనే పై కథలోని ఏనుగులా అనుభవిస్తాం)

## 174. అద్దంలో నువ్వు

ఓ పిసినారి ధనవంతుడు ఓ మఠాధిపతిని దర్శించడానికి వెళ్ళాడు. ఆ మఠాధిపతి అతన్ని ఓ కిటికీ దగ్గరకి తీసుకెళ్ళి చెప్పాడు.

"అద్దంలోంచి బయటకి చూడు. ఏం కనిపిస్తోందో చెప్పు."

"మగవాళ్ళు, ఆడవాళ్ళు, పిల్లలు కనిపిస్తున్నారు." చూసి జవాబు చెప్పాడు అతను.

మఠాధిపతి తర్వాత అతన్ని పక్కనే వున్న నిలువుటద్దం ముందుకి తీసుకెళ్ళి అడిగాడు.

"ఇప్పుడు ఏం కనిపిస్తోంది?"

"నేనే కనబడుతున్నాను."

"గమనించు. కిటికీకి ఓ గ్లాస్ వుంది. ఈ అద్దం కూడా గ్లాసే. దీని వెనక భాగానికి కొద్దిగా వెండిని పూసారు. దాంతో నువ్వు ఇతరులని చూడటం ఆగిపోయి, నిన్ను నువ్వే చూసుకుంటున్నావు. దీన్ని గురించి ఆలోచించు. నీకు ఏదైనా మంచి స్ఫురించవచ్చు."

తన సంపద తనకే పరిమితం కావాలి తప్ప, ఇతరులకి చెందకూడదన్న తన స్వభావాన్ని ఆ మఠాధిపతి నర్మగర్భంగా చెప్పాడని ఆ ధనవంతుడికి అర్థమైంది. ఆ ప్రవచనంతో అతని ప్రవర్తనలో మార్పు వచ్చింది. అద్దం వెనక గల ఆ వెండి పొరని తుడిచేసి, ప్రపంచాన్ని చూడటం అలవరచుకున్నాడు. దాంతో బీదలకి దానం చేయడం మొదలెట్టాడు.